క్లుప్తంగా

కనుల పండువగా అశ్వవాహన సేవ



ఆలయంలో అశ్వవాహన సేవ

తలకొండపల్లి: మండల పరిధిలోని దేవుని పడకల్ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం రాత్రి అశ్వవాహన సేవ కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు పద్మనాభచార్యులు, రామాచార్యులు వేద మంత్రాలు చదువుతుండగా వేంకటేశ్వస్వామి ఉత్సవ విగ్రహాన్ని అశ్వవాహన రథంపై ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణం నుంచి కల్యాణ మండపం వరకు అశ్వవాహన సేవ కొనసాగింది. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి తిలకించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ లట్టుపల్లి రాజుకుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీశైలం, మాజీ ఉప సర్పంచ్ తిరుపతి, కృష్ణగౌడ్, ఆలయ క్లర్క్ ఆంజనేయులు, నిర్వాహకులు మధుకుమార్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, మల్లేష్, స్వామిగౌడ్, శంకర్, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా ఈస్టర్



ఈస్టర్ వేడుకలో సంఘం సభ్యులు

కడ్తాల్: మండల కేంద్రంలోని యేహోవా నిస్సీ మినిస్ట్రీస్ ప్రార్థన మందిరంలో, ఫాస్టర్ సఫీయా దస్తగిరి ఆధ్వర్యంలో ఈస్టర్ వేడుకలను , ఆరాధన కార్యక్రమాలను ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాస్టర్ సఫీయా నవాబు పాషా యేసు పునరుద్ధానం గురించి వివరించారు. అనంతరం పలు గీతాలు అలపించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు మహిళలు, చిన్నారులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో బొడ్రాయి ప్రతిష్ఠ ఉత్సవాలు



పూజలు చేస్తున్న భక్తులు

మాడ్గుల: మండలం పరిధిలోని కొలుకులపల్లిలో బొడ్రాయి ప్రతిష్ఠ వార్షిక ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు మురుకుంట్ల శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, హోమం నిర్వహించారు. అనంతరం మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. బొడ్రాయికి పెద్ద ఎత్తున ప్రజలు పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు బట్టు కిషన్ రెడ్డి, మాజీ సర్పంచ్ అనురాధ, ప్రజలు పాల్గొన్నారు.

నేడు బూత్‌స్థాయి ఏజెంట్లకు శిక్షణా తరగతులు

తలకొండపల్లి: కల్వకుర్తి, అచ్చంపేట్ నియోజకవర్గాల బూత్‌స్థాయి (బీఎల్‌ఏ) బూత్ లెవెల్ ఏజెంట్‌ల శిక్షణను నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి ఆదివారం పేర్కొన్నారు. అచ్చంపేట్ పట్టణంలోని ఏసీఆర్ గార్డెన్స్‌లో శిక్షణ తరగతులను సోమవారం ఉ. 9 గంటలకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి ఏఐసీసీ కోఆర్డినేటర్ కొప్పుల రాజు, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి, ఏఐసీసీ సెక్రటరీ సంపత్‌కుమార్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ మల్లురవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిలు ముఖ్య అతిథిలుగా హాజరవుతారని అన్నారు. నియోజకవర్గాల బూత్ లెవెల్ ఏజెంట్ల, కిసాన్‌సెల్ వర్కింగ్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు, సేవాదళ్, మైనార్టీ, సోషల్ మీడియా, డీసీసీ, బ్లాక్ కాంగ్రెస్ కార్యదర్శులు, ఎస్సీ సెల్, ఎన్ఎస్‌యూఐ, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, ఇతర నాయకులందరూ తప్పనిసరిగా శిక్షణ తరగతులకు హాజరై విజయవంతం చేయగలరని ఆయన కోరారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

షాబాద్: ఆలయాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని ఎంపీటీసీ అశోక్, వ్యాపారవేత్త విశ్వనాథం పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని మల్లన్న ఆలయంలో వారు ప్రత్యేక పూజలు చేశారు. నూతనంగా నిర్మిస్తున్న ఆలయానికి అశోక్ రూ. 51వేలు, విశ్వనాథం రూ.51వేలు అందజేశారు. అనంతరం గ్రామస్తులు వారిని సత్కరించారు.

మళ్లీ క్యాంపు రాజకీయం

- ఏప్రిల్ 6న ప్రత్యేక సమావేశం
- అదే రోజు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక
- చైర్మన్ కోసం వదరాని పాట్లు
- మరోమారు క్యాంప్‌నకు బయలుదేరిన కౌన్సిలర్లు



మర్రి నిరంజన్‌రెడ్డి



ఆదిబట్ల మున్సిపల్ కార్యాలయం

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీ రాజకీయం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఈ సారి ఎట్టి పరిస్థితుల్లో చైర్మన్ కుర్చీ చేజారకుండా అందరూ కలిసి కట్టుగా ఉండటానికి మళ్లీ క్యాంపు రాజకీయం మొదలు పెట్టారు. అప్పట్లో నెల రోజుల పాటు క్యాంపులు నిర్వహించారు. ఖర్చులు తడిసిమొపడైన బేఫరాక్ అన్నట్లుగా రాజకీయం చేస్తున్నారు. ఈ సారి గురి తప్పేది లేదని గన్‌షాట్‌గా కుర్చీనాదే అన్నట్లుగా ప్రణాళిక రూపొందించారు. వైస్ చైర్మన్ విషయంలో స్పష్టత కరువైంది. ఒకే ఒక్కడు ఓ సాధారణ కౌన్సిలర్ మర్రి నిరంజన్‌రెడ్డి ప్రభుత్వంలోని పెద్దలకు గట్టి పోటీ ఇస్తున్నాడు. అలాగని అయన ఇతర ఏ పార్టీలో లేడు. కాంగ్రెస్ బహిష్కృత నేతగా ఉన్నాడు. మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుంచి ఇక్కడ సంచలనాలే చోటు చేసుకున్నాయి.

చక్రం తిప్పుతున్న మర్రి నిరంజన్‌రెడ్డి

ఆదిబట్ల మున్సిపాలిటీలో మొదట 2018లో జరిగిన ఎన్నికల్లో 8 మంది కాంగ్రెస్ కౌన్సిలర్లు, ఆరుగురు బీఆర్ఎస్, ఒకటి బీజేపీ గెలుచుకుంది. అప్పట్లో బీఆర్ఎస్ అధికారంలో ఉండటంతో ఎక్స్ అఫిషియో సభ్యులను ఉపయోగించి కాంగ్రెస్‌లో ఉన్న కౌన్సిలర్ ఆర్తికను బీఆర్ఎస్‌లోకి తీసుకొని చైర్మన్ అయ్యారు. అప్పట్లో మర్రి నిరంజన్‌రెడ్డి గెలిచి ఓడిపోయినంత పని అయ్యింది. యేడాది గడవకముందే చైర్‌పర్సన్ ఆర్తిక గౌడ్, మర్రి నిరంజన్ రెడ్డి ఆధ్వర్యం అప్పటి ఎంపీ కొమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమక్షంలోనే కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుంది. అప్పటి నుంచి పాలకవర్గంలో సఖ్యత లేకపోవడంతో 13 మంది కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు చైర్‌పర్సన్‌పై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మరోమారు డిసెంబర్ నెలలో చైర్‌పర్సన్, వైస్‌చైర్ పర్సన్‌లపై అవిశ్వాసం ఫిర్యాదు కలెక్టర్‌కు చేశారు. ఫిబ్రవరి 9న ప్రత్యేక సమావేశంలో ఇద్దరిని తొలగించాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు. అప్పటి నుంచి మర్రి నిరంజన్‌రెడ్డి చక్రం తిప్పారు. కౌన్సిలర్లు అంతా మర్రికే మద్దతు తెలిపారు.

అడుగడుగునా అడ్డంకులే...

మర్రి నిరంజన్‌రెడ్డి అడ్డంకులకు కేరాఫ్‌గా మారాడు. 2014లో ఎంపీపీగా ఎన్నిక కావడం కూడా మొదటిసారి కాకుండా రెండోసారి ఎంపీపీ అయ్యాడు. చైర్మన్ విషయంలో కూడా ఇదే జరగనుంది. కాంగ్రెస్‌లో ఉండి కాంగ్రెస్ చైర్మన్‌ను తొలగించడానికి కృషి చేశాడని ఇప్పటికే పార్టీ సస్పెండ్ చేసింది. అలాగే, ప్రభుత్వంలో ఉన్న మంత్రులు, ఎమ్మెల్యే స్థాయి ప్రజాప్రతినిధులు సైతం నోటిఫికేషన్ తేదీ ఇవ్వకుండా అడ్డుపడ్డారనే ఆరోపణలు చేశారు. దీంతో ఫిబ్రవరి 9వ తేదీ నుంచి నేటి వరకు కొత్త చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక తేదీ ఖరారు కాలేదు. దీంతో చివరకు హైకోర్టును ఆశ్రయించడంతో ఏప్రిల్ 6వ తేదీని ఎన్నికల కమిషన్ ప్రకటించింది. 4వ తేదీ వరకు పూర్తిస్థాయిలో సభ్యులకు ప్రత్యేక సమావేశం సర్క్యులర్ జారీ చేయాలి. 6న ప్రత్యేక సమావేశం నిర్వహించాలి. అనివార్య కారణాల వల్ల సమావేశం జరగకుంటే 7న నిర్వహించాలని నిర్ణయించారు. బీజేపీ కౌన్సిలర్ రాములు, గతంలో వైస్ చైర్మన్‌గా ఉన్న కళమ్మ కొంగరకలాన్‌కు చెందిన హరిదాసు, మహేందర్, వనం శ్రీనివాస్ పోటీ పడుతున్నారు. అదృష్టం నిరంజన్‌రెడ్డిని వరిస్తుందా లేదా అనేది చూడాలి.

రైతులను ప్రోత్సహించేందుకే పోటీలు

పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి, కాంగ్రెస్ నేత ప్రభాకర్‌రెడ్డి

తలకొండపల్లి: రైతులను ప్రోత్సహించేందుకే పందెం గుండు పోటీలను నిర్వహిస్తున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని దేవుని పడకల్ వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం ఆలయ ప్రాంగణంలో అంతరాష్ట్రీయ బండలాగుడు పోటీలను నిర్వహించారు. ఈ పోటీలో ప్రథమ, ద్వితీయ బహుమతులను (రూ. లక్షా 80 వేలు) దాత శతాబ్ది టౌన్షిపు మేనేజింగ్ డైరెక్టర్ కాసు శ్రీనివాస్‌రెడ్డి, తృతీయ బహుమతి (రూ. 70,116) దాత కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి, ఎస్ఆర్ డెవలపర్స్ వారు చతుర్థ బహుమతులు (రూ. 50,116) వ్యక్తిగతంగా అందజేశారు. పందెం గుండు పోటీలను కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీశైలం, ఎంపీటీసీ జోగు రమేష్ ప్రారంభించారు. ఈ పోటీల్లో నాలుగు జతల ఎద్దుల పాల్గొన్నాయి. ప్రథమ, ద్వితీయ బహుమతులను ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వైఎస్ఆర్ జిల్లా కడపకు చెందిన మార్తాల చంద్ర ఓబుల్‌రెడ్డి విజయం సాధించగా వారికి రూ.లక్షా 80 వేలను అందజేశారు. తృతీయ బహుమతి నాగర్‌కర్నూల్ జిల్లా యాదిరెడ్డిపల్లికి చెందిన డాక్టర్ అఖిలేశు రూ. 70,116, చతుర్థ బహుమతి వనపర్తి జిల్లా పెద్దగడ గ్రామానికి చెందిన గోపాలకృష్ణలు గెలుచుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి, డోకూరి ప్రభాకర్‌రెడ్డిలు, మాజీ సర్పంచ్ శ్రీశైలం, ఎంపీటీసీ రమేష్‌లతో విజేతలకు బహుమతులు ప్రాదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ పోటీలతో రైతులు ఆర్థికంగా లబ్ధి పొందుతారని అన్నారు. గత 20 ఏళ్లుగా పోటీలను నిర్వహిస్తున్నారని చెప్పారు. పెద్ద ఎత్తున ఆయా గ్రామాల ప్రజలు పోటీలను తిలకించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రవి, యాదయ్య, జగ్గారెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, ఎంపీటీసీలు రఘు, రమేష్, మాజీ సర్పంచ్ శ్రీశైలం, శంకర్, తిరుపతి, కృష్ణగౌడ్, శేఖర్‌రెడ్డి, కాసు శ్రీనివాస్‌రెడ్డి, రామస్వామి, మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.



దేవుని పడకల్‌లో బండలాగుడు పోటీలు

త్వరలో బీఆర్ఎస్ కనుమరుగు



విలేకరులతో మాట్లాడుతున్న కేశవులు

ఆమనగల్లు: రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభావం కోల్పోయిందని పార్లమెంట్ ఎన్నికల అనంతరం ఆ పార్టీ కనుమరుగు అవుతుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, ఆమనగల్లు మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు అన్నారు. అభివృద్ధిని కాంక్షించి పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలంతా కాంగ్రెస్‌తో కలిసి రావాలని పిలుపునిచ్చారు. పట్టణంలో ఆదివారం కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు రవీందర్ నాయక్, ఎస్టీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పులికంటి మైసయ్యలు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌తోనే అభివృద్ధి, సామాజిక న్యాయం సాధ్యమన్నారు. రాష్ట్రంలో 14 పార్లమెంట్ స్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకుని సత్తా చాటుతుందన్నారు. కేంద్రంలో అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో అవినీతి, కుంభకోణాలతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పూర్తిగా దెబ్బతిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్థిక పరిస్థితిని చక్కదిద్ది గాడిలో పెడుతుందన్నారు. ఉమ్మడి పాలమూరు పార్లమెంట్ స్థానాలు భారీ మెజార్టీతో కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని వివరించారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనునాయక్, రాగ్య నాయక్, తదితరులున్నారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠాపన వేడుకలు



యజ్ఞహోమాలు నిర్వహిస్తున్న భక్తులు



విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మహిళలు

తలకొండపల్లి: మండలంలోని చీపునుంతల గ్రామంలో శివసీతారామాంజనేయస్వామి దేవాలయంలో విగ్రహాల ప్రతిష్ఠ వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. శివ, నంది, గణపతి, సుబ్రహ్మణం, సీతారామ లక్ష్మణ, ఆంజనేయ, ధ్వజ, శిఖర దేవతామూర్తుల యంత్ర ప్రతిష్ఠ తదితర విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. శనివారం రాత్రి జలధివాసం కార్యక్రమం నిర్వహించారు. బాజభజంత్రీలు, మంగళవాయిద్యాలు, డప్పుల చప్పుళ్లతో, వేద పండితుల మంత్రచ్ఛరణాల మధ్య ఉత్సవ విగ్రహాలను నీటిలో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఇంటి నుంచి మహిళలు బిందెడు శుద్ధ జలాన్ని తీసుకొచ్చి విగ్రహాలను అభిషేకించారు. ఆదివారం విశేష ధాన్యదివాసం కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. విగ్రహాలను నవధాన్యాలతో ప్రత్యేక పూజలు చేశారు. ధాన్యం గింజలపైన విగ్రహాలను ఉంచి సమస్త ధాన్యం రాశులు పండే విధంగా దీవించాలని పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి తిలకించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. అనంతరం ఆలయంలో యజ్ఞ హోమాలు, మూల మంత్ర జపాలు, పారాయణాలు, అభిషేకాలు, 108 మృత్తికా కలశాలతో మహాస్నపనం, జీవ, తత్వ, ప్రాణ, కళాన్యాస, రుద్ర, పంచపుష్ప, వస్త్ర, సౌభాగ్య ద్రవ్యాధివాసాలు, హారతి, తదితర పూజలు చేశారు. ప్రతి ఇంటి నుంచి భక్తులు పూలు, పండ్లు గాజులు, తిలకం, కుడుకలు, నూతన వస్త్రాలు తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి దేవతామూర్తుల అనుగ్రహం పొందారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు బత్తుల కుమార్‌గౌడ్, నరోత్తంరెడ్డి, వెంకటయ్యగౌడ్, నగేశ్, యాదయ్య, కృష్ణయ్య, గిరి, రామచంద్రయ్య, జనార్దన్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజురెడ్డి, చిన్నారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



ఉత్సవాల కోసం ముస్తాబైన ఆలయం

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి తుర్కయంజాల్‌లోని హరిహర పుత్ర అయ్యప్పస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు నేటి నుంచి 4వ వరకు కొనసాగనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం 4.30 గంటలకు గణపతి పూజ, గణపతి, సుబ్రమణ్యస్వామి, పార్వతి పరమేశ్వరులు, సత్యనారాయణ స్వామి, అభయాంజనేయ స్వామి, నవగ్రహాల విగ్రహాల ఊరేగింపు నిర్వహించనున్నారు. 2న ఉ. 8 గంటలకు గణపతి పూజ, అఖండ దీపారాధన, అగ్నిప్రతిష్ఠ, అన్నప్రసాద వితరణ, సాయంత్రం 5 గంటలకు మండప పూజలు, విగ్రహాలకు క్షీరాధివాసం, అవాహిత దేవత హోమాలు, 3న మూల మంత్ర హోమాలు, ధాన్యాధివాసం, 4న ఉదయం 6 గంటలకు ప్రాతకాల పూజలు, 7 గంటలకు యంత్ర ప్రతిష్ఠ విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఇంటి నిర్మాణానికి సాయం

ఆమనగల్లు: నిరుపేద ఇంటి నిర్మాణానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సిమెంట్ అందించి అందజేసి ఆర్థిక అండగా నిలిచింది. ఆమనగల్లు మున్సిపాలిటీలోని 12 వార్డు శాంతి నగర్ కాలనీ చెందిన తల్లోజు శివకుమార్ ఇంటి నిర్మాణానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, తలకొండపల్లి జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్‌ను స్థానిక నాయకుడు నాగిల్ల జగన్ ద్వారా సంప్రదించగా వారికి 50 బ్యాగుల సిమెంట్‌ను అందజేశారు. కార్యక్రమంలో సపిడి మల్లయ్య, మహేశ్ తదితరులు ఉన్నారు.

వైభవంగా కంఠ మహేశ్వరస్వామి ఉత్సవాలు



హోమంలో పాల్గొన్న గౌడ సంఘ నాయకులు



విగ్రహ ప్రతిష్ఠలో భక్తులు

అమనగల్లు: మండల పరిధిలోని ఆకుతోటపల్లి గ్రామంలో ఆదివారం సురమాంబ సహిత కంఠ మహేశ్వరస్వామి విగ్రహ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గౌడ సంఘ ఆధ్వర్యంలో నవీన్‌శర్మ అర్చక బృందంతో అత్యంత భక్తిశ్రద్ధలతో గణపతి పూజ హోమం వివిధ పూజలు నిర్వహించారు. పూజ కార్యక్రమాలతో ఆకుతోటపల్లి గ్రామంలో అధ్యాత్మిక శోభ సంతరించుకుంది. వివిధ గ్రామాల నుంచి బంధువుల రాకతో పండుగ వాతావరణం కనిపించింది. కార్యక్రమంలో గౌడ ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు వీరేశ్ గౌడ్, శేఖర్‌గౌడ్, శ్రీనుగౌడ్, రవిగౌడ్, తిరుపతి, నర్సింహ, కష్ణ, మహేశ్, బాలారాజు, మహిళలు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

నిధులు లేకే.. నిర్మాణం ఆగింది!


- అసంపూర్తిగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం
- రెండేళ్లుగా స్లాబ్‌కే పరిమితం
- నిధులు మంజూరు కాక ఆగిన పనులు



అసంపూర్తిగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టి రెండేళ్లు గడిచినా నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గంగౌడి అక్కడే అన్నట్లుగా ఉంది. అద్దె భవనంలో కొనసాగుతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఇబ్రహీంపట్నం పాత బస్టాండ్ వద్ద నిర్మిస్తే ఈ పరిసర ప్రాంతాలు, బస్తీలు మరింత అభివృద్ధి దిశగా అడుగులు పడతాయన్న ఉద్దేశంతో .. అక్కడున్న గోదాంల స్థలంలో కార్యాలయాన్ని నిర్మించాలని మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి నిర్ణయించారు. అనుకున్నట్లుగా పాత బస్టాండ్ వద్ద ఉన్న గోదాంలను తొలగించి, ఆ స్థలంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సొంత భవన నిర్మాణానికి ఫిబ్రవరి 2022లో అప్పటి మంత్రి కేటీఆర్‌తో శంకుస్థాపన చేయించారు. ఈ భవన నిర్మాణానికి 1.50 కోట్ల డీఎంఎఫ్‌టీ నిధులను కేటాయిస్తున్నట్లు తెలిపారు. కేవలం 18 లక్షలు మాత్రమే మంజూరు కావడంతో గ్రౌండ్ లెవెల్ స్లాబ్ నిర్మాణం వరకే ఆ నిధులు సరిపోయాయి. నిర్మాణ పనులు పునఃప్రారంభించాలని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తూ మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రాలు అందజేసిన ప్రయోజనం లేదు. నిర్మాణం చుట్టూ మట్టి కుప్పలు పోయడంతో అటు నుంచి వెళ్లే వారికి ఇబ్బందిగా మారింది. కార్యాలయ నిర్మాణానికి కోటి రూపాయలను మంజూరు చేయాలని టీయూఐడీఎఫ్(రాష్ట్ర అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డవలప్‌మెంట్ ఫండ్) అధికారులు ప్రతిపాదనలు పంపినట్లు తెలుస్తుంది. ప్రస్తుత ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అయినా నిధులు మంజూరు చేయించి నిర్మాణం పూర్తి చేయించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

“కార్యాలయాన్ని ఎప్పుడు ప్రారంభిస్తారు.. ?



2022లో శంకుస్థాపన చేసిన భవన నిర్మాణం పిల్లర్లు, స్లాబ్ వరకు వచ్చి పనులు ఆగాయి. ఇరుకైన అద్దె భవనంలో కొనసాగుతున్న సబ్‌రిజిస్ట్రార్ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ భవన నిర్మాణంపై ఉలుకుపలుకులేదు. వెంటనే పనులు ప్రారంభించి త్వరితగతిన పనులు పూర్తి జరిగేలా చర్యలు చేపట్టాలి.

–కంచకట్ల భాస్కర్, బీఆర్ఎస్ నాయకుడు, ఇబ్రహీంపట్నం

ప్రతిపాదనలు పంపాం



సాబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి డీఎంఎఫ్‌టీ(డిస్ట్రిక్ మినరల్ ఫండ్ ట్రస్ట్) కింద రూ.18 లక్షలు మంజూరయ్యాయి. స్లాబ్ లెవెల్ వరకు ఆ నిధులు సరిపోవడంతో పనులు నిలిచిపోయాయి. ఈ అసంపూర్తి నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు మరోకోటి రూపాయల కోసం టీయూఐడీఎఫ్(రాష్ట్ర అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డవలప్‌మెంట్ ఫండ్) ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరుకాగానే పనులు ప్రారంభిస్తాం.

–రవీంద్రసాగర్, మున్సిపల్ కమిషనర్

కొనసాగుతున్న పారిశుద్ధ్య స్పెషల్ డ్రైవ్



బైపాస్ రోడ్డులో చెత్తను తొలగిస్తున్న సిబ్బంది



చెత్త తొలగింపుతో క్లీన్‌గా కనిపిస్తున్న బైపాస్ రోడ్డు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ సిబ్బంది పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. చెత్తచెదారం, పిచ్చిచెట్లు, మురికినీరు, ప్లాస్టిక్ కవర్లతో దుర్గంధం వెదజల్లుతున్నా పలు బస్తీలు, కాలనీల పరిసరాలు స్పెషల్ డ్రైవ్‌తో శుభ్రం అవుతున్నాయి. సుమారు నెలరోజులుగా పట్టణంలోని 24 వార్డుల్లోని చెత్తచెదారాన్ని తొలగించడంలోనే పారిశుద్ధ్య సిబ్బంది నిమగ్నమైంది. మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని స్పెషల్ డ్రైవ్‌పై ఫోకస్‌ను పెట్టారు. చెత్తచెదారం, పిచ్చి చెట్లుతో పాటు దుర్వాసనతో నిండివుండే ఇబ్రహీంపట్నం (కృష్ణ వాటర్ పైపులైన్) బైపాస్ రోడ్డును క్లిన్ చేశారు. దోమల, ఈగల వ్యాప్తి చెందకుండా, పరిసరాల పరిశుభ్రంగా ఉండేందుకు తీసుకుంటున్న చర్యలను స్థానికులు అభినందిస్తున్నారు. ప్రజలు కూడా తమకు సహకరించాలని మున్సిపల్ యంత్రాంగం కోరుతుంది. తడి,పొడి చెత్తను వేరు చేసి, ఇంటి ముందుకు వచ్చే మున్సిపల్ వాహనాల్లో వేయాలని కోరుతున్నారు.